ప్రజాశక్తి

శుక్రవారం 28 ఫిబ్రవరి 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

పోలింగ్ ప్రశాంతం

- విశాఖ జిల్లాలో 87.34, అనకాపల్లి జిల్లాలో 96.22 శాతం నమోదు
- చీడికాడ, రోలుగుంట, మాకవరపాలెం, ఎస్.రాయవరం మండలాల్లో శత శాతం
- చంద్రంపాలెం పోలింగ్ బూత్ వద్ద ఎమ్మెల్యే గంటా హల్‌చల్



విశాఖలో ఓటు హక్కు వినియోగించుకున్న మహిళా ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో/అనకాపల్లి ప్రతినిధి/విశాఖ కలెక్టరేట్

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ గురువారం ప్రశాంతంగా సాగింది. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ కేంద్రాల వద్ద ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. విశాఖ జిల్లాలో 87.34 శాతం, అనకాపల్లి జిల్లాలో 96.22 శాతం పోలింగ్ నమోదైంది. ఉత్తరాంధ్ర అంతటా కలిపి 92.40 శాతం పోలింగ్ జరిగింది. విశాఖపట్నం జిల్లాలో 13 పోలింగ్ కేంద్రాల పరిధిలో 5,529 మంది ఓటర్లు ఉండగా 4,829 మంది వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు విశాఖపట్నం జిల్లాలో ఓటింగ్ సరళిని జిల్లా కలెక్టరేట్ మీటింగు హాలులో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పర్యవేక్షించారు. అలాగే డాబాగార్డెన్స్ పరిధిలోని ప్రేమ హైస్కూల్, ఎయు ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాలను సందర్శించి పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. సహాయక రిటర్నింగ్ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్ ఎప్పటికప్పుడు పోలింగ్ శాతం వివరాలను సేకరించి రిటర్నింగ్ అధికారికి నివేదించారు.



పోలింగ్ కేంద్రాల పరిశీలనలో నాయక్, హరేంధిర ప్రసాద్

ఎంఎం. నాయక్ పర్యవేక్షణ

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియను, ఇతర పరిస్థితులను ఎన్నికల పరిశీలకులు ఎంఎం.నాయక్ సమీక్షించారు. జిల్లా కలెక్టర్‌తో కలిసి ఎయు ప్రాథమిక పాఠశాల పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ పరిస్థితులను గమనించారు. పోలింగ్ సరళిని పరిశీలించారు. అప్రమత్తంగా ఉంటూ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు అనంతరం కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూంకు చేరుకొని జిల్లా, ఉత్తరాంధ్ర పరిధిలోని ఇతర జిల్లాల్లో జరుగుతున్న పోలింగ్ తీరును పర్యవేక్షించారు. రిటర్నింగ్, సహాయక అధికారులకు, ఆయా జిల్లాలో పరిధిలోని ఎఆర్ఒలకు తగిన ఆదేశాలు జారీ చేశారు.

పటిష్ట ఏర్పాట్లు చేశాం

ఉత్తరాంధ్రలోని 123 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని రిటర్నింగ్ అధికారి హరేంధిర ప్రసాద్ తెలిపారు. అన్నిచోట్లా పటిష్ట ఏర్పాట్లు చేశామని, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా కనీస వసతులు కల్పించామని చెప్పారు. అన్ని జిల్లాల పరిధిలో పోలింగ్ నెమ్మదిగా మిగతా 2లో..

చెరుకు రైతుల కష్టాలు పట్టవా ?

- గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో పూర్తి స్థాయి క్రషింగ్‌కు చర్యలు చేపట్టాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

వార్త 2లో..



తీరానికి భక్తుల తాకిడి

- భక్తి శ్రద్ధలతో సముద్ర స్నానాలు

వార్త 4లో..



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

చెరుకు రైతుల కష్టాలు పట్టవా ?

- గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో పూర్తి స్థాయి క్రషింగ్‌కు చర్యలు చేపట్టాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

ప్రజాశక్తి - చోడవరం : ప్రభుత్వానికి, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి చెరుకు రైతుల కష్టాలు పట్టవా ? అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం ప్రశ్నించారు. తక్షణమే గోవాడ సుగర్స్‌లో పూర్తి స్థాయి క్రషింగ్‌కు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్‌పై ఇటు రాష్ట్ర ప్రభుత్వం, అటు యాజమాన్యం ఆది నుంచీ రైతులను ఇబ్బందులకు గురిచేస్తూనే ఉన్నాయన్నారు. ఎట్టకేలకు క్రషింగ్ ప్రారంభించి, రైతులందరూ చెరుకును ఫ్యాక్టరీకి తీసుకొస్తుంటే క్రషింగ్‌ను పూర్తిస్థాయిలో చేయకుండా, తరుచూ నిలిపివేయడం తగదన్నారు. క్రషింగ్‌ను నిలిపివేస్తుండటంతో రోజుల తరబడి పశువులు, ట్రాక్టర్లతో వచ్చిన రైతులు ఫ్యాక్టరీ వద్దే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రైతుల్లో ఆక్రోశం కట్టలు తెంచుకుని గురువారం ఫ్యాక్టరీ గేటు వద్ద భారీ ఆందోళనకు దారితీసిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఫ్యాక్టరీకి పూర్వ వైభవం తెస్తానని చెప్పి నేడు పత్తా లేకుండా పోయారన్నారు. రైతాంగం ఇక్కడ ఆందోళన చేస్తున్నా పట్టించుకోకుండా ఎమ్మెల్సీ ఎన్నికల్లో మునిగిపోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహకార రంగంలో నడుస్తున్న సుగర్ ఫ్యాక్టరీల పట్ల అత్యంత నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోందన్నారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఎలాగైనా మూత పెట్టాలని కుట్రలు పన్నుతోందని తెలిపారు. అటువంటి చర్యలకు పూనుకుంటే రైతాంగంతో కలిసి సిపిఎం పెద్ద ఎత్తున ఆందోళన చేస్తుందని హెచ్చరించారు. ఇప్పటికైనా ఫ్యాక్టరీ యాజమాన్యం చెరుకు గానుగాటను ఎటువంటి అంతరాయాలూ లేకుండా పూర్తి సామర్థ్యంతో చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని ఫ్యాక్టరీకి తగిన సహాయ సహకారాలు అందించాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వివి.శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఐఎఫ్‌టియు విలీన సభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రెండు ఐఎఫ్‌టియు విప్లవ కార్మిక సంఘాల రాష్ట్ర స్థాయి విలీన సభ మార్చి 2న రాజమండ్రి పుష్కర ఘాట్, చందా సత్రంలో జరగనున్నట్టు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విలీన సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను బలవంతంగా కార్మిక వర్గంపై రుద్ది కార్మిక హక్కులను కాలరాయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని విమర్శించారు. ఒక వైపున నిత్యావసర సరుకుల ధరలు పెద్ద ఎత్తున పెరుగుతూ ఉంటే, మరో వైపు కార్మికుల వేతనాల తగ్గింపు, పనిభారాల పెంపు తీవ్రమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బలమైన కార్మిక పోరాటం నిర్మించడానికి ఈ విలీనం దోహదపడుతుందన్నారు. సమావేశంలో సంఘం సీనియర్ నాయకులు వై.కొండయ్య, జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతిరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీను, దుర్గ, గురప్ప పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు దారుణం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేకనే కూటమి పాలనలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుపుతూ వైసిపి నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ ఆరోపించారు. పోసాన కృష్ణమురళి అరెస్టును ఖండిస్తూ గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. పవన్, లోకేష్ ఇద్దరి దగ్గర రెడ్ బుక్స్ ఉన్నాయని, భారత రాజ్యాంగాన్ని అనుసరిస్తూ నిర్వర్తించాల్సిన బాధ్యతలను తుంగలో తొక్కుతూ కేవలం కక్షపూరిత రాజకీయాలకే వారు పరిమితమయ్యారని మండిపడ్డారు. పోసాని అరెస్టు పవన్ కల్యాణ్ ఆలోచన అని ఆరోపించారు. ప్రఖ్యాతి చెందిన ఆంధ్రప్రదేశ్ నేడు చంద్రబాబు కబంధ హస్తాలలో ఉండి ప్రపంచవ్యాప్త ఇమేజ్ డామేజ్ అవుతోందని విమర్శించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వాళ్లే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా ఎదిరించి నిలబడతామని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అసలు పరిపాలన జరుగుతుందా ? అని ప్రశ్నించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగస్వాములుకండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో జివిఎంసి పరిధిలో 2024 సంవత్సరానికి సంబంధించి స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రారంభమైందని జివిఎంసి అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ నగర ప్రథమ స్థానం లక్ష్యంగా జివిఎంసి యంత్రాంగం కృషి చేస్తోందని వెల్లడించారు. దీనిలో విశాఖ నగర ప్రజల అభిప్రాయ సేకరణ ముఖ్య భూమికని, అందుకు ప్రజలు తమ అమూల్యమైన అభిప్రాయాలను స్వచ్ఛ సర్వేక్షణ్‌లో తెలియపరచాలని కోరారు.

పోలింగ్ ప్రశాంతం

(మొదటి పేజీ తరువాయి..)
ప్రారంభమైనప్పటికీ క్రమేణా జోరందుకుందని వివరించారు.

అనకాపల్లి జిల్లాలో ఇలా..

ఉత్తరాంధ్రలో అనకాపల్లి జిల్లాలో భారీగా పోలింగ్ నమోదైంది. రఘువర్మకు మద్దతు ఇచ్చిన టిడిపి హడావుడి పోలింగ్ కేంద్రాల వద్ద కనిపించింది. అది ప్రదర్శించిన అధికార దర్పాన్ని ఉపాధ్యాయ, అధ్యాపకులు పెద్దగా పట్టించుకోలేదు. కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పి తుహిన్ సిన్హా తీసుకున్న ముందస్తు భద్రత చర్యలతో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎస్పి కశింకోటలోని బజార్‌వీధి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికలు సజావుగా జరిగేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీసులకు సూచించారు. అనకాపల్లి జిల్లాలో 2,885 ఓట్లకు 2,776 (96.22 శాతం) ఓట్లు పోలయ్యాయి. కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి పోలింగ్ సరళిని కలెక్టర్ విజయ కృష్ణన్ పర్యవేక్షించారు.

మొత్తం 2,885 ఓట్లలో పురుష ఓటర్లు 1789 మందిలో 1719 మంది, మహిళా ఓటర్లు 1096 మందిలో 1057 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. చీడికాడ, రోలుగుంట, మాకవరపాలెం, ఎస్.రాయవరం మండలాల్లో శత శాతం పోలింగ్ నమోదైంది. మునగపాక మండలంలో 91.11 శాతం పోలింగ్ జరిగింది. 24 పోలింగ్ కేంద్రాల్లోనూ 90 శాతానికి పైబడి పోలింగ్ నమోదైంది. పోలింగ్ ప్రారంభమైన ఉదయం 8 గంటల నుంచి గడువు ముగిసిన సాయంత్రం 4 గంటల వరకు ఓటర్లు వచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు డివిజన్ కంటే అనకాపల్లి జిల్లాలో పోలింగ్ శాతం ఎక్కువగా వుంది. విశాఖపట్నంలో 87.34, శ్రీకాకుళంలో 94.72, విజయనగరం జిల్లాలో 94.05, పార్వతీపురం మన్యంలో 93.74, అల్లూరి సీతారామరాజు జిల్లా (పాడేరు డివిజన్)లో 88.04 శాతం చొప్పున పోలింగ్ నమోదుకాగా అనకాపల్లి జిల్లాలో గణనీయంగా 96.22 శాతం పోలింగ్ జరిగింది.

గంటాకు నిబంధనలు పట్టవా ?

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి గురువారం జరిగిన పోలింగ్ సందర్భంగా మధ్యాహ్నం 12 గంటల సమయంలో భీమిలి టిడిపి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తన అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోగల చంద్రంపాలెం హైస్కూల్ పోలింగ్ బూత్ నెంబర్ 120లోకి తన పార్టీకి చెందిన 10 మంది అనుచరులతో వెళ్లి హల్‌చల్ చేశారు. క్యూలైన్లలో ఉన్న ఓటర్లకు ఆయన నమస్కారం చేసి కాసేపు తరువాత వెళ్లిపోయారు. అధికార పార్టీ ఎమ్మెల్యే మండలి నిబంధనలను ఉల్లంఘించి లోపలకు ప్రవేశిస్తున్నా పోలీసులు, అధికారులు ప్రేక్షక పాత్ర పోషించడం అందరినీ నివ్వెరపరిచింది. రాజకీయాలతో నిమిత్తం లేకుండా కేవలం ఉపాధ్యాయ సంఘాల మధ్య జరగాల్సిన పోరు ఇది. కానీ దానికి భిన్నంగా ఈసారి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సాగాయి. ఎన్నికల నిబంధనల ప్రకారం రాజకీయ ప్రముఖులెవరూ పోలింగ్ కేంద్రం చెంతకు రాకూడదు. అలాంటిది ఏకంగా బూత్ వద్దకే గంటా వెళ్లడంతో పలువురిలో చర్చ జరిగింది.



ఓటు వేసేందుకు వస్తున్న ఉపాధ్యాయిని



విజయనగరంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి

పటిష్ట భద్రతా ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు, శివరాత్రి సముద్ర స్నానాలు ఒకేరోజు కావడంతో గురువారం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రాత బాగ్చి పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా నగరంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఆయన ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద నియమించబడిన అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్న తీరును స్వయంగా పరిశీలించారు ఉన్నతాధికారుల పర్యవేక్షణలో పోలింగ్ టీంలు, మొబైల్ టీంలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ పోలింగ్ కేంద్రాల్లో ఉన్న సిబ్బందికి పోలింగ్ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేటట్లు కీలక సూచనలు చేశారు. అదేవిధంగా మహాశివరాత్రిని పురస్కరించుకొని నగరంలోని ప్రముఖ తీర ప్రాంతాలైన ఆర్కే బీచ్, రుషికొండ, భీమిలి, యారాడ, అప్పికొండ బీచ్‌ల వద్ద భక్తులు పుణ్య స్నానాలు నిర్వహించే చోట గట్టి పోలీస్ భద్రత ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా తీర ప్రాంతాల్లో డ్రోన్లను వినియోగిస్తూ నిరంతరం అప్రమత్తంగా ఉంటూ భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పర్యవేక్షణ చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం పోలీస్ అవుట్ పోస్టులను ఏర్పాటు చేసి పోలీస్ సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు.

సముద్రంలో ప్రమాదకర రీతిలో వెళ్లిపోయిన ఆరుగురు భక్తులను గజ ఈతగాళ్ళ సాయంతో రక్షించారు. జనసమూహంలో చిన్నారులు తప్పిపోకుండా అత్యాధునిక సాంకేతికత అయిన రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్ఎఫ్ఐడి)ని ఉపయోగించి చిన్నారులు తప్పిపోకుండా చర్యలు చేపట్టారు. పలు ప్రాంతాల్లో తప్పిపోయిన 10 మంది చిన్నారులను గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

బ్యాలెట్ బాక్సులు భద్రం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా వినియోగించిన బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. ఉత్తరాంధ్ర పరిధిలోని ఆరు జిల్లాల్లో ఓటర్లు వేసిన బ్యాలెట్ పేపర్లతో కూడిన బాక్సులు గురువారం రాత్రికి ఎయులో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కౌంటర్ వద్దకు చేరుకోగా వాటిని పరిశీలించి స్థానిక అధికారులు స్వీకరించారు. అనంతరం వాటిని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. బ్యాలెట్ పేపర్లలో కూడిన బాక్సులను భద్రపరిచిన గదులకు అభ్యర్థుల సమక్షంలో రిటర్నింగ్ అధికారి సీలు వేశారు. ఎన్నికల కమిషన్ పేర్కొన్న అన్ని రకాల నింబంధనలనూ పాటించి సంబంధిత ప్రక్రియలను పూర్తి చేశారు. మరలా వాటిని మార్చి 3వ తేదీన అభ్యర్థుల సమక్షంలో తెరవనున్నారు.



స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేసి సంతకం చేస్తున్న ఆర్ఒ హరేంధిర ప్రసాద్

దయనీయం.. దర్జీల జీవితం

- రెడీమేడ్‌తో బతుకు బేజారు
- వృత్తిని వీడ లేక.. ప్రత్యామ్నాయం చేత గాక...
- రెట్టింపైన ముడి సరుకు ధరలు



ప్రజాశక్తి - తగరపువలస

రెడీమేడ్ దుస్తుల విక్రయాల జోరుతో దర్జీల బతుకులు దయనీయంగా మారాయి. ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలు మిగిలిన చిన్నా, చితక రంగాల మాదిరిగానే చేతివృత్తులపై కూడా తీవ్ర ప్రభావం చూపిందనే చెప్పాలి. ఉపాధి మార్గంగా ఉన్న టైలరింగ్ నేడు దీనావస్థకు చేరిందని పలువురు టైలర్లు వాపోతున్నారు.

బతుకు భారమై..

తగరపువలస, చిట్టివలస ప్రాంతంలో 60 టైలరింగ్ దుకాణాలు ఉన్నాయి. ఇళ్లలో బట్టలు కుట్టి ఉపాధి పొందే వారు ఇంకొందరు ఉన్నారు. 60 దుకాణాల్లో యజమానులు గాకుండా సుమారు 150 మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారు. ప్యాంట్, షర్ట్ కుడితే రూ 600 మజూరు (చార్జీ) తీసుకుంటున్నారు. ఇందులో నుంచే దుకాణంలో పనిచేసే కార్మికునికి రూ.250 ఇస్తున్నట్లు యజమానులు చెబుతున్నారు. ముడిసరుకు రూ.200, మిగిలేది రూ.150 అని వివరించారు. కాజాలు, బటన్లు వేసే వారికి రూ.15, ఇస్త్రీకి రూ.20, వచ్చిన ఈ కొద్ది మొత్తంలోనే భరించాలని చెబుతున్నారు. ఇందులోనే దుకాణం అద్దెలు, కరెంట్ బిల్లులు, మిషన్ మరమ్మతులు, ఇతరత్రా ఖర్చులు పెట్టుకోవాలని వారి కష్టాలు వివరించారు.

రెడీమేడ్ ప్రవేశంతో అవస్థలు..

మారుతున్న కాలానికి అనుగుణంగా రెడీమేడ్ వస్త్రాల కొనుగోలుకు యువతీ యువకులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు రెడీమేడ్ వ్యాపారులు ఆఫర్లు చూపి యువతను ఆకర్షిస్తున్నారు. టైలరింగ్ వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న వారి ఉపాధికి తీవ్రంగా దెబ్బ తగులుతుంది.

రెట్టింపైన ముడి సరుకు ధరలు..

ముడి సరుకు ధరలు ఏటా రెట్టింపవుతున్నాయి. షర్ట్, ప్యాంట్‌కు అవసరమైన రెండు దారాలు ఉండలు ధర కిందటి ఏడాది రూ.8 ఉండగా, ఇపుడు రూ.12కు చేరింది. కాజా, బటన్లుకు రూ.20 నుంచి రూ30కి, జిప్ రూ.4 నుంచి రూ.6కి, రెండు హుక్కులు రూ.5 నుంచి రూ.10కి, ప్యాంట్, షర్ట్‌కు చెరో బకరం రూ.15 నుంచి రూ.20కి, కత్తెర ధర రూ.250 నుంచి రూ.350కి పెరిగినట్లు టైలర్లు చెప్పారు. జూకి కంపెనీ మిషన్ గతంలో రూ.15 వేలు ఉండగా నేడు రూ.26 వేలు ఉన్నట్లు చెప్పారు. ఏడాదిలో రెండు సార్లు మిషన్ రిపేరు చేయాల్సి వస్తుందని, ఆ సమయంలో రూ.వెయ్యి నుంచి రూ.రెండు వేలు ఖర్చు అవుతుందని అంటున్నారు కొందరు టైలర్లు.

అద్దెలు... పన్నులు..

తగరపువలసలో ఏ ఒక్కరికీ సొంత దుకాణం లేదు. నెలకు రూ.5 వేలు నుంచి రూ.8 వేలు వరకు అద్దెలు చెల్లిస్తూ దుకాణాలు నడుపుతున్నామని టైలర్లు చెబుతున్నారు. కరెంట్ చార్జీలు కూడా పెరిగాయని తెలిపారు.

నేరాలు ఘోరాలు

గంజాయి కేసులో పదేళ్లు జైలు

ప్రజాశక్తి- లీగల్/ గొలుగొండ : గంజాయి కేసులో ముద్దాయికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 1 లక్ష జరిమానా విధిస్తూ విశాఖపట్నం ఎంఎస్‌జె కోర్టు కం ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఎం.వెంకటరమణ గురువారం తీర్పు చెప్పారు. సకాలంలో జరిమానా చెల్లించకుంటే మరో ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసులో వాదనలు వినిపించిన గ్రేడ్ వన్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జివిఎస్‌వి.ప్రసాదరావు ఇచ్చిన సమాచారం మేరకు....

అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం చీడిగుమ్మల పంచాయతీ పోలవరం గ్రామానికి చెందిన నిందితుడు గజ్జి సత్తిబాబు (40) తండ్రి అప్పలరాజు 2014 నవంబర్ 22న ట్రాక్టర్‌లో 183 కిలోల గంజాయితో పోలీసులకు పట్టుబడ్డాడు. అప్పటి గొలుగొండ ఎస్ఐ ఎన్.జోగారావు గంజాయిని స్వాధీనం చేసుకొని క్రైమ్ నెంబర్ 121 /2014 ఎన్‌డిపిఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడు గజ్జి సత్తిబాబుపై నేరం రుజువైనందున పై విధంగా న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు.

స్కూటీ చోరీ కేసులో 3 నెలల జైలు శిక్ష

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు పరిధి కాపులుప్పాడ డంపింగ్ యార్డు ప్రాంతానికి చెందిన ఆసనాల పెంటయ్యకు చెందిన స్కూటీని దొంగతనం చేసిన కేసులో నిందితుడైన విజయనగరానికి చెందిన మూగి లక్ష్మణరావుకు మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ స్థానిక కోర్టు తీర్పు ఇచ్చినట్లు నేర విభాగం ఎస్ఐ ఎస్.సూర్యప్రకాశరావు గురువారం తెలిపారు. 2024 ఏప్రిల్ 14న ఈ దొంగతనం జరిగినట్లు వివరించారు. తన ఇంటి వద్ద పార్కింగ్ చేసిన స్కూటీ చోరీకి గురైనట్లు బాధితుడు పెంటయ్య నేర విభాగం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లోనే కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. విచారణ అనంతరం ఈ మేరకు కోర్టు తీర్పు ఇచ్చినట్లు తెలిపారు.

అన్నదానం

ప్రజాశక్తి -యంత్రాంగం

పద్మనాభం : మహాశివరాత్రిని పురస్కరించుకొని మండలంలోని మద్ది, విలాస్‌ఖాన్‌పాలెం, అనంతవరం, గందవరం, పద్మనాభం, రెడ్డిపల్లి తదితర గ్రామాల్లో శివాలయాల వద్ద మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

ఆనందపురం : ఆనందపురం మండలం ముకుందపురం గ్రామ పంచాయతీలో మహాశివరాత్రి సందర్భంగా గురువారం శివాలయం వద్ద మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. సుమారు 3 వేల మంది భక్తులకు అన్నదానం ఏర్పాటుచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కలిమి గంగరాజు, జానకిరామరాజు, మాజీ సర్పంచ్ శనగం అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -మధురవాడ : పి.ఎం.పాలెం 33/11కేవీ సబ్ స్టేషన్, సప్తగిరి ఫీడర్ మరమ్మతులు, చెట్టు కొమ్మలు తొలగించుటకు శుక్రవారం విద్యుత్ నిలుపుదల చేయనున్నట్లు జోన్ 3 డిఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఈ నేపథ్యంలో సప్తగిరి కాలనీ , చాణక్యపూరి లే-అవుట్, పీర్జేస్ కాలనీ, తారక రామనగర్, బింద్రానగర్, గుప్త లే-అవుట్, మధురవాడ సబ్‌స్టేషన్ నగరంపాలెం 11కేవీ ఇంటిగ్రేల్ ఫీడర్ నిర్వహణ పనుల నిమిత్తం గణేష్‌నగర్, పోర్టు కాలనీ, కళా నగర్, బొట్టవానిపాలెం, స్వతంత్రనగర్, డాక్‌యార్డు కాలనీ, వాంబేకాలనీ, శ్రీనివాస్‌నగర్, నగరంపాలెం, వైఎస్ఆర్.కాలనీ, గాయత్రీ విద్య హస్పిటల్, కార్పెంటర్స్ కాలనీ, వికలాంగుల కాలనీ, శివశక్తినగర్ రోడ్, అయ్యప్పనగర్, శ్రీలక్ష్మి నగర్, సద్గురుసాయి నాథ్ కాలనీ, గణేష్‌నగర్ రోడ్ తదితర ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

జూ పార్కు సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు



జూ పార్కు సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో గురువారం మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యాన జంతు సంరక్షకులకు, పరిపాలనా సిబ్బందికి ఉచితంగా సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ జ్యోత్స్న జూ ఉద్యోగులకు రక్తపోటు, సుగర్ స్క్రీనింగ్‌లు, కార్డియాక్ మూల్యాంకనాలు ఇతర అవసరమైన వైద్య సేవలు అందజేశారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ మంగమ్మ మాట్లాడుతూ, జంతు సంరక్షణ, పరిరక్షణ కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్న వారి శ్రేయస్సు కోసం ఈ వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. జూ సిబ్బందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించిన మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

2 నుంచి విద్యార్థులకు పోటీలు..

ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని పురస్కరించుకొని మార్చి 2వ తేదీన విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలను నిర్వహించనున్నట్లు జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. ఒకటవ తరగతి నుంచి పీజీ వరకు మూడు కేటగిరిలో ఈ పోటీ ఉంటుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జూ పార్కులోని బయోస్కో సమావేశం మందిరంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. జీవ వైవిధ్యం, వాటి పరిరక్షణ గురించి అవగాహన కల్పించడం ఈ పోటీ ముఖ్యఉద్దేశం అన్నారు. విద్యార్థులు తమ పోస్టర్లను ఇంట్లోనే సిద్ధం చేసి పోటీ సమయంలో ప్రదర్శించాలని పేర్కొన్నారు.

గీతంలో ఫ్రాన్స్ విద్యాలయాల సందడి

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఫ్రాన్స్ దేశానికి చెందిన విశ్వవిదాలయాలతో ప్రత్యేక కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. దాదాపు 16 ఫ్రాన్స్ విశ్వవిద్యాలయాల నుంచి అకడమిక్ ప్రతినిధులు హజరయ్యారు. చూజ్ ఫ్రాన్స్ టూర్ పేరిట జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయాల ప్రతినిధులు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఉన్నత విద్యా రంగంలో ఫ్రాన్స్ విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్, అవి నిర్వహిస్తున్న కోర్సులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫ్రాన్స్ ప్రతినిధి బృందం గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణిపప్పు వారితో సమావేశమయ్యారు. జీసీజీసీ డైరెక్టర్ వంశీకిరణ్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి.రవికాంత్ సంధానకర్తగా వ్యవహరించారు.

సైన్స్‌పై అవగాహనకు ప్రత్యేక కార్యక్రమం

ప్రజాశక్తి -మధురవాడ : విద్యార్థుల్లో సైన్స్‌పై అవగాహన పెంచేందుకు నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజి కమ్యూనికేషన్ (ఎన్‌సిఎస్‌టిసి), గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ద్వారా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇది పాఠశాల విద్యార్థులలో స్ఫూర్తిని నింపుతోంది. గత మూడు నెలలలో 13 ప్రభుత్వ పాఠశాలలలో 8125 మంది విద్యార్థులను ప్రభావితం చేసింది. ఫిబ్రవరి 28వ తేదీ జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా దీనిపై ప్రత్యేక కథనం.

విద్యార్థులలో నూతన ఆలోచనలను రేకెత్తించే విధంగా సైన్స్ ప్రయోగాలను ప్రభుత్వ పాఠశాలలలో ఆసక్తి కరంగా చేసి చూపించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం "లెట్ అజ్ డు సైన్స్" పేరిట ఈ ప్రాజెక్టును అమలు చేస్తోంది. జిల్లా విద్యాశాఖతో కలిసి ఆనందపురం, నరవ, చంద్రంపాలెం, చింతల అగ్రహారం, పెందుర్తి, తగరపువలస, భీమిలి, మద్దిలపాలెం, కొమ్మాది, ఎన్ఎడి, కె.కోటపాడు, విజయనగరం తదితర ప్రాంతాలలో గల జిల్లా పరిషత్, ఇతర పాఠశాలలలో సైన్స్ కార్యక్రమాలను చేపట్టారు. గీతం విశ్వవిద్యాలయం నుంచి 33 మంది, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి 24 మంది, గాయత్రి విద్యా సంస్థ నుంచి ఒకరు మొత్తం 58 మంది పీజీ, యుజి విద్యార్థులను ఒక బృందంగా ఏర్పాటు చేశారు. భౌతిక, రసాయన శాస్త్రాలతో పాటు కంప్యూటర్ సైన్స్, బయోటెక్నాలజి, ఫార్మశీ, సైకాలజి, నర్సింగ్, మైక్రోబయాలజి వంటి అంశాలలో ఆసక్తి కరమైన విజ్ఞాన శాస్త్ర ప్రయోగాల జాబితాను రూపొందించారు. ఈ బృందానికి గీతం భౌతిక శాస్త్ర విభాగం అధ్యాపకులు డాక్టర్ బి.స్పందన, గీతం ఇంజినీరింగ్, సైన్స్ కళాశాలలకు చెందిన డాక్టర్ వివికె.లక్ష్మి, డాక్టర్ కె.నవీన్‌కుమార్, డాక్టర్ కె.ఆదర్శకుమార్, డాక్టర్ పి.కనకరాజు, సైన్స్ ఎడ్యుకేటర్స్ ఉదయ కాళేశ్వరరావు గుప్తా, బి.శ్రావణి నేతృత్వం వహించారు. పాఠశాల విద్యార్థులకు విజ్ఞాన శాస్త్ర విశేషాలను వివరించడానికి, వారిలో ఆసక్తి పెంచడానికి పాఠ్యపుస్తకాలలోని అంశాలకు తగినట్లుగా చిన్న, చిన్న సైన్స్ ప్రయోగాల జాబితాను తయారుచేశారు. ఇళ్లలో ఉపయోగించే మిక్సర్, వాషింగ్ మిషన్, ఫ్యాన్, హీటర్, క్యాలికులేటర్ ఎలా పనిచేస్తాయో వాటి వెనక ఉపయోగించే శాస్త్ర విజ్ఞానం వివరిస్తూ సందేహలను నివృత్తి చేశారు. నిత్య జీవితంలో రక్తం నమూనాలను పరిశీలించడం, వివిధ రకాల పరీక్షలు, వ్యాధి నిర్ధారణ వంటి అంశాలను తెలియజేశారు. వీటితో పాటు సూర్య గ్రహణం, చంద్రగ్రహణం ఏర్పడే విధానం వంటి అంశాలతో పాటు డ్రోన్‌లు ఎగిరే సాంకేతికత, రోబోలు పనిచేసే తీరు వంటివి విద్యార్థులకు ఆసక్తికరంగా వివరించారు. పాఠశాలల నుంచి వస్తున్న అనూహ్య స్పందనను దృష్టిలో ఉంచుకొని విద్యాశాఖ సహకారంతో మరికొన్ని పాఠశాలలకు వెళ్లనున్నట్లు డాక్టర్ స్పందన తెలిపారు. అధ్యాపకులకు ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహించే ఉద్దేశంలో ఉన్నామన్నారు. ఈ ప్రాజెక్టు విజయవంతం కావడం మరికొన్ని పాఠశాలలకు విస్తరించడానికి స్ఫూర్తిని ఇస్తోందని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెవిజి.కృష్ణ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.వేదవతి పేర్కొన్నారు.



ఫుడ్ ఫెస్టివల్‌ను తిలకిస్తున్న డాక్టర్ హేమలత తదితరులు

అమ్మ వంట ఆరోగ్యకరం

ప్రజాశక్తి -గాజువాక : అమ్మ వంట ఆరోగ్యకరమని పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.హేమలత అన్నారు. జివిఎంసి 70వ వార్డు పరిధి చట్టివానిపాలెం భాస్కర్ విద్యా నికేతన్‌లో విద్యార్థులచే పౌష్టికాహార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ హేమలత ప్రారంభించి మాట్లాడుతూ, రకరకాల రుచులకు అలవాటు పడి ఇంట్లో అమ్మచేసిన వంటలు కాకుండా బయట వివిధ రసాయనాలు ఉపయోగించి చేసిన పదార్థాలు తినడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ప్రతి రోజూ వ్యాయామం తప్పకుండా చెయ్యాలన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని చెప్పారు. మరో అతిథి మెడివరల్డ్ హాస్పిటల్ న్యూట్రిషన్ డాక్టర్ నేహ పర్వీన్ మాట్లాడుతూ, ప్రోటీన్స్, విటమిన్స్, కార్బోహైడ్రేట్స్ కలిగిన కల్తీ లేని ఆహార పదార్థాలు తినాలని సూచించారు. ఆకుకూరలు, పండ్లు, కాయగూరలు, చిరు ధాన్యాలు, గింజలు రోజూ తీసుకోవాలన్నారు. పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు మాట్లాడుతూ, పోషకాహార లోపంతోనే చాలా మంది చిన్న వయసులోనే అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ఈ కారణం చేతనే పౌష్టికాహారంపై విద్యార్థులకు అవగాహన కల్పించుటకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏయే ఆహార పదార్థాల్లో ఏయే పోషక విలువలున్నాయో ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులు తెలుసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచి ఆరోగ్యాన్ని ఇచ్చే చిరుధాన్యాలు, రాగి జావ, మొక్కజొన్న, ఆకు కూరలు, పండ్ల రసాలు, వివిధ రకాల, వంట నూనెలు, కూరగాయలు, మొలకలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ పి.రమాదేవి, ఉపాధ్యాయులు అమరావతి, శిరీష, శ్వేత, మేరీ, దివ్య, రాణి, జిప్సా అధ్యక్షుడు బి.శ్రీనివాస్, కార్యదర్శి ఎస్.షణ్ముఖరావు, వివిధ పాఠశాలల కరెస్పాండెంట్లు జగ్గారావు, మురళీ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో గానామృతం

ప్రజాశక్తి -ఉక్కునగరం : మహా శివరాత్రి సందర్భంగా స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోరుతూ ఉక్కునగరంలో ఉక్కు అభ్యుదయ కళావేదిక ఆధ్వర్యాన 'గానామృతం' సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. శివునిపై గీతాలు, అభ్యుదయ, పోరాట, చలనచిత్ర గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు వైటి.దాస్ మాట్లాడుతూ, కళాకారులు తమ పాటలు, నాటికల ద్వారా కార్మికులను, ప్రజలను చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ తక్షణమే ఆపాలని, కార్మికుల జీతాలు తక్షణమే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భీమలింగం, గణేష్ (కీబోర్డ్), శ్రీనివాస్ కొర్లాం, నాగలింగం (తబలా), కె.సింహాచలం (డప్పు), కోటేశ్వరరావు (ఫ్లూట్), గాయకులు జి.సత్యనారాయణ, నూకరాజు, సరోజినీ, పార్థసారథి, గోవిందరాజు, శ్రీనివాసరావు, బ్రహ్మాజీ, కెవి.రత్నం, కామేష్, గౌరీశంకర్, కె.సత్యనారాయణ, కృష్ణార్జున, టి.శ్రీనివాసులు, సువర్ణరాజు పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి -ఉక్కునగరం : మహాశివరాత్రి సందర్భంగా ఉక్కు పరిరక్షణ కోరుతూ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన అప్పికొండ వెళ్లే భక్తులకు లక్ష్మీనగర్ వద్ద మజ్జిగ కేంద్రం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు జి.శ్రీనివాసరావు, నమ్మి రమణ మాట్లాడుతూ, ఉక్కు పరిరక్షణకు అందరూ మద్దతు తెలియజేయాలని, విశాఖ ఉక్కును కారు చౌకగా అమ్మాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తోందని అన్నారు. అందులో భాగంగా పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులను తొలగించే చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో కె.సత్యవతి, నమ్మి సోమునాయుడు, నమ్మి దేవుడు, అహ్మద్ వల్లీ, మద్ది శ్రీనివాస్‌రెడ్డి, వరలక్ష్మి, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



అప్పికొండ భక్తులకు మజ్జిగను పంపిణీచేస్తున్న సిఐటియు నాయకులు

'పది'పై ప్రత్యేక శ్రద్ధ

శతశాతం ఉత్తీర్ణతకు ప్రణాళికలు



మధురానగర్ పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి-సీతమ్మధార : పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. పబ్లిక్ పరీక్షలంటే విద్యార్థులకున్న భయాన్ని పోగొట్టి మంచి మార్కులు సాధించేలా కృషిచేస్తున్నారు. ప్రతి విద్యార్థీ ఉత్తీర్ణత సాధించేలా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు వంద రోజుల ప్రణాళికను పటిష్టంగా అమలు చేస్తున్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ఉన్న 8 ప్రభుత్వ పాఠశాలల్లో 873 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. శత శాతం ఉత్తీర్ణ సాధించేందుకు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా ఒక్కొక్కరు 6 నుంచి 8 మంది పదో తరగతి విద్యార్థులను దత్తత తీసుకున్నారు. దత్తత తీసుకున్న విద్యార్థులు ఎలా చదువుతున్నారు? ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారు? వారిలో భయాన్ని పోగొట్టి ఆత్మవిశ్వాసం నింపేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. రోజూ పరీక్షలు నిర్వహించడం, సందేహాల నివృత్తి, వెనుకబడిన సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. వంద రోజులు ప్రణాళికలో భాగంగా రోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. సాధారణ పనివేళ కంటే ఉదయం ఒక గంట, సాయంత్రం గంటన్నర అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం ఒక సబ్జెక్ట్ సాయంత్రం మరో సబ్జెక్ట్ చదివిస్తున్నారు. సెలవు రోజును కూడా ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం ఒక సబ్జెక్ట్ మధ్యాహ్నం మరో సబ్జెక్ట్ చదివిస్తున్నారు.

మంచి మార్కులు సాధించేలా కృషి

మధురనగర్ హైస్కూల్ విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణతకు కృషిచేస్తున్నాం. ప్రభుత్వ నిబంధన ప్రకారం నెల రోజులపాటు ఉదయం 8 నుచి సాయంత్రం 9 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది 89 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాం.



శాంతికుమారి,
ప్రధానోపాధ్యాయులు
మధురానగర్ హైస్కూల్

నేడు ఉమామహేశ్వరరావు ఉద్యోగ విరమణ



మాసవరపు సత్య వెంకట ఉమామహేశ్వరరావు దంపతులు

ప్రజాశక్తి- గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ సెంటర్ ప్లాంట్ విభాగంలో జనరల్ ఫోర్‌మ్యాన్‌గా పనిచేస్తున్న మాసవరపు సత్య వెంకట ఉమామహేశ్వరరావు శుక్రవారం ఉద్యోగ విరమణ చేస్తున్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో సుమారు 38 సంవత్సరాలు పాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. ఆయన విద్యాభ్యాసం 5వ తరగతి నుంచి పదవ తరగతి వరకు పరవాడ మండలం వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సాగింది. 1982వ సంవత్సరంలో ఇంటర్మీడియట్, బొబ్బిలిలో ఐటిఐ విద్య అభ్యసించారు.ఉద్యోగం రాకముందు బ్లాస్ట్ ఫర్నేస్-2లో తారాపూర్ కంపెనీలో చేరారు. తర్వాత పర్మినెంట్ ఉద్యోగంలో చేరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ డైరెక్టర్‌గా, కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించి, సొసైటీని రాష్ట్రంలోనే ఉత్తమ సొసైటీగా తీర్చిదిద్దారు. సెంటర్ ప్లాంట్ విభాగంలో సిఐటియు కమిటీ అధ్యక్షునిగా, కార్యదర్శిగా, సెంట్రల్ ఆఫీస్ బేరర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 57వ వార్డు మున్సిపల్ వర్కర్ యూనియన్ గౌరవాధ్యక్షులుగా, సిఐటియు స్టీల్ డివిజన్ అధ్యక్షులుగా కూడా బాధ్యతలు నిర్వహించారు.

ఘనంగా స్వచ్ఛంద సంస్థల దినోత్సవం

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రపంచ స్వచ్ఛంద సంస్థల దినోత్సవాన్ని గురువారం పౌర గ్రంథాలయంలో వైజాగ్ ఎన్‌జిఒ ఫోరమ్ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. సీనియర్ ఎన్‌జిఒ నరవ ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ముఖ్య అతిథి మేయర్ గొలగాని హరివెంకటకుమారి, గౌరవ అతిథి ఆచార్య వి.బాలమోహన్‌దాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ నిర్మూలన, మొక్కలు నాటడం, పేదరిక నిర్మూలన కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు జివిఎంసితో కలిసి పనిచేయడం అభినంద నీయమన్నారు. నగర అభివృద్ధి కార్యక్రమాల్లో వారిని భాగస్వాములను చేస్తామని చెప్పారు. అనంతరం స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సత్కరించారు. ఆచార్య వి.బాలమోహన్ దాస్ మాట్లాడుతూ, ఇష్టపడి చేసే సేవ నిజమైనదన్నారు. అనంతరం మేయర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో దాత్రి సంస్థ అధినేత విశాలాక్షి, డేవిడ్ రాజు, ప్రజ్ఞానకుమార్, వాసు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

తీరానికి భక్తుల తాకిడి

భక్తిశ్రద్ధలతో సముద్రస్నానాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాత్రంతా జాగారం చేసిన తర్వాత తెల్లవారితే గురువారం సంప్రదాయ ప్రకారం సముద్రంలో స్నానాలు ఆచరించారు. ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు అడపా దడపాగా వచ్చిన భక్తులు 9 గంటల నుంచి 11 గంటల మధ్యలో పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5గంటల వరకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. జివిఎంసి మూడో వార్డు బీచ్ స్వాగత ద్వారం నుంచి సాగరకన్య బొమ్మ, చిన్న పిల్లల పార్కు వరకు, 4వ వార్డు పరిధిలో చేపలుప్పాడ, మంగమారి తీర ప్రాంతంలో భక్తులు స్నానాలు చేశారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలతో పాటు పక్కనే ఉన్న విజయనగరం జిల్లా భోగాపురం, డెంకాడ తదితర ప్రాంతాల నుంచి మోటారు బైక్‌లు, కార్లు, ఆటోల్లో స్నానాలకు వచ్చారు. సముద్రపు ఇసుకతో శివలింగం ఆకారంలో తీర్చిదిద్ది పలువురు పూజలు చేయడం కనిపించింది. ఈ సందర్భంగా భక్తులు పితృ దేవతలకు పిండ ప్రదానం, సాలిగ్రామ దానం, స్వయంపాకం చేశారు. జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమప్రసన్న వాణి ఆధ్వర్యాన ఎఇ సురేష్ ఏర్పాట్లు చేశారు. చిన్న పిల్లలకు బిస్కెట్లు అందజేశారు.

ముందస్తు జాగ్రత్త చర్యలు...

సముద్రంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పోలీసులు, జివిఎంసి అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. సిఐ సుధాకర్, ఐదుగురు మెరైన్ పోలీసులు, 20 మంది పోలీస్ కానిస్టేబుళ్లతో బందోబస్తు ఏర్పాటుచేశారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తీరప్రాంతాన్ని సందర్శించారు. బోయివీధికి చెందిన 30 మంది గజ ఈత గాళ్లను, 3 బోట్లను, లైఫ్ జాకెట్లను సిద్ధం చేశారు.

జివిఎంసి ఒకటో జోన్ ఆధ్వర్యాన స్థానిక స్వాగత ద్వారం, ఫౌంటెన్, లైట్ హౌస్, మంగమారిపేట, ఉప్పాడ గ్రామం తదితర 6 చోట్ల తాగు నీటి సదుపాయం కలిగించారు. 25 మంది పారిశుధ్య కార్మికులు 3, 4 వార్డుల పరిధిలో తీర ప్రాంతంలో పరిశుభ్రత చర్యలు చేపట్టారు.



భీమిలి బీచ్‌లో స్నానాలు చేస్తున్న భక్తులు

సజావుగా ఎమ్మెల్సీ పోలింగ్

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు విశాఖ, అనకాపల్లి జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ నిర్వహణకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయగా, ఉపాధ్యాయ ఓటర్లు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. ప్రధాన పోటీలో ఉన్న ముగ్గురు అభ్యర్థుల మద్దతుదారులు పోలింగ్ కేంద్రాల వద్ద పోటాపోటీ శిబిరాలను ఏర్పాటుచేశారు. పటిష్టనిఘా, పోలీసుల భద్రత నడుమ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా పోలింగ్ ముగిసింది.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)



నక్కపల్లిలో చంకలో బిడ్డతో ఓటేయడానికి వచ్చిన మహిళా ఉపాధ్యాయ ఓటరు



పెందుర్తిలో ఛాలెంజింగ్ ఓటేసిన అనురాధ



గాజువాకలో కానిస్టేబుల్ సాయంతో ఓటింగ్‌కు వస్తున్న టీచర్ ఓటరు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని రైల్వే న్యూ కాలనీ వద్ద ఉన్న కెఎన్ఎం హైస్కూల్ పోలింగ్ బూత్ నెంబర్ 116లో మొత్తం 500 ఓట్లకుగాను 408 పోలయ్యాయి. 81.60 శాతం నమోదైంది. కంచరపాలెం ఊర్వశి జంక్షన్ వద్ద ఉన్న గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్ పోలింగ్ బూత్ నెంబర్ 117లో మొత్తం 421 ఓట్లకుగాను 371 ఓట్లు పోలయ్యాయి. 89.12 శాతం ఓట్లు నమోదయ్యాయి. ఆయా కేంద్రాలను పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి ఎన్నికల ఏజెంట్ ఎ.అజశర్మ పరిశీలించారు.

కె.కోటపాడు మండల కేంద్రంలోని ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రంలో 107మంది ఓటర్లు ఉండగా పోలింగ్ ముగిసే సమయానికి 102 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఓటేశారు. 69 పురుషులు 33 మంది మహిళా ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారని ఎన్నికల అధికారి తెలిపారు.

సబ్బవరం : స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రంలో 98.93 శాతం పోలింగ్ నమోదైంది. 94 మంది ఒక్కరు మినహా అందరూ ఓటేశారు. పోలింగ్ కేంద్రాన్ని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, పెందుర్తి టిడిపి ఇంచార్జి గండి బాబ్జి గురువారం సందర్శించారు.

కశింకోట : స్థానిక బాలుర హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో 84 మందికిగాను 83మంది ఉపాధ్యాయులు ఓటేశారు. పురుషులు 47మంది, మహిళలు 36మంది మొత్తంగా 83 మంది ఓటేయగా, 98.8 శాతం పోలింగ్ నమోదైంది.

మునగపాక: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 45 మంది ఉపాధ్యాయ ఓటర్లకుగాను 41మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు 41 మంది పురుష ఓటర్లకు 37మంది, నలుగురు మహిళా ఓటర్లకు అందరూ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

బుచ్చయ్యపేట: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రంలో 34 మంది ఓటర్లకు గాను 33 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

దేవరాపల్లి : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రంలో 63 మందిఓటర్లకు గాను 62 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళలు 22 మందికి 22 మంది ఓటేయగా, పురుష ఓటర్లలో ఒక్కరు మినహా 41 మందికి గాను 40 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎస్ఐ టి. మల్లేశ్వరరావు, అదనపు ఎస్ఐ పి. రాములమ్మ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు

భీమునిపట్నం : స్థానిక ఎంఎఫ్‌సియుపి పాఠశాలలో 123 పోలింగ్ కేంద్రంలో 92.3 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం ఓట్లు 261 కాగా మహిళలు 104 మంది, పురుషులు 157 మంది ఉన్నారు. 241 ఓట్లు పోలైనట్లు ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ భాస్కరరావు తెలిపారు. పోలైన 241ఓట్లలో మహిళలు 94 మంది, పురుషులు 147 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాన్ని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, స్థానికంగా ఏర్పాటుచేసిన శిబిరాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సందర్శించారు.

పెందుర్తి : పెందుర్తి ప్రభుత్వ పాఠశాలలో బూత్ నెంబర్ 113లో 954 ఓటర్లు ఉన్నారు. మహిళా ఓటర్లు 456, పురుషులు 407 ఓట్లు ఉన్నాయి. మొత్తం 863 ఓట్లు పోలైనట్లు అధికారులు పేర్కొన్నారు. 90.46 ఓటింగ్ శాతం నమోదయిందని తెలిపారు. కేంద్రాన్ని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి ఎన్నికల ఏజెంట్ అజశర్మ సందర్శించారు.



మధురవాడ పోలింగ్ కేంద్రంలో బందోబస్తు పర్యవేక్షిస్తున్న సిపి శంఖబ్రత బాగ్చీ

ఈ బూత్‌లో 523 సీరియల్‌తో ఉన్న అనురాధశెట్టి ఓటు వేయడానికి వెళ్లగా అప్పటికే ఓటు వేసినట్లు చెప్పి వెనక్కి పంపించారు. ఆమె స్థానిక నాయకులు, ఎన్నికల అధికారులతో మాట్లాడి ఛాలెంజ్ ఓటు వేశారు. ఉపాధ్యాయుల ఓట్ల పరిస్థితే ఇలా ఉంటే సామాన్యుల పరిస్థితి ఏమిటని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు ఈ కేంద్రంలో మూడు ఛాలెంజ్ ఓట్లు పడినట్లు సమాచారం.

మధురవాడ : చంద్రంపాలెం ఉన్నతపాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో 908 ఓట్లుకు గాను 763 ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సందర్శించారు. శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సందర్శించి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు.

పద్మనాభం : పద్మనాభం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోపి 121 పోలింగ్ కేంద్రంలో 85 మంది ఓటర్లకు 84 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళలు 15 మంది ఉండగా వారంతా ఓటు వేశారు. పురుషులు 70 మందికి 69 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

గాజువాక : నడుపూరులోని జిల్లాపరిషత్ హైస్కూల్లో ఏర్పాటుచేసిన 111 పోలింగ్ స్టేషన్‌లో 101 ఓట్లు ఉండగా, 96 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు 40 మంది, స్త్రీలు 56 మంది ఓటు వేశారు.

గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటుచేసిన 112 పోలింగ్‌కేంద్రంలో 708 ఓట్లు ఉండగా 614 ఓట్లు పోలయ్యాయి. పురుషులు 222 మంది, స్త్రీలు 392 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్‌కేంద్రాలను సిపి శంఖబ్రత బాగ్చి, పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి ఎన్నికల ఏజెంట్ అజశర్మ సందర్శించారు.

ములగాడ : ములగాడలోని బూత్ నెంబర్ 118లో 166 ఓట్లకు గానూ 154 ఓట్లు పోలయ్యాయి. 89 మంది మహిళలు, 65 మంది పురుషులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఆనందపురం: ఆనందపురం పాఠశాలలో 44 మంది ఓటర్లకు 43 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 30 మంది పురుషులు, 13 మంది స్త్రీలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని అధికారులు తెలిపారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి కేంద్రాన్ని సందర్శించారు.

ఆరిలోవ : చినవాల్తేరులోని ఎయు ప్రైమరీ స్కూలు వద్ద ఏర్పాటుచేసిన 114 పోలింగ్ బూత్‌లో 747 (351 మంది పురుషులు, 396 మంది మహిళలు) మంది ఉపాధ్యాయులకు 620 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు 293 మంది, స్త్రీలు 327 మంది ఓటు వేసినట్లు అధికారులు తెలిపారు. 83 శాతం పోలింగ్ నమోదైనట్లు పేర్కొన్నారు..

నక్కపల్లి:ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా జరిగింది. 52 మంది ఓటర్లు ఉండగా 51 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. నక్కపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నెంబర్ 101 పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం 52 మంది ఓటర్లకుగాను 51 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 33, మహిళలు 18 ఉన్నారు. తహసిల్దార్ నరసింహమూర్తి, ఆర్ఐ కన్నబాబు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి,పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎక్కడా ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కోటవురట్ల:ప్రభుత్వ ఉన్నత పాఠశాల 98వ పోలింగ్ కేంద్రంలో గురువారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి, 81 మందికి గాను 78 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారి గోపి నాదరావు తెలిపారు, తహసిల్దార్ తిరుమల బాబు పోలింగ్ కేంద్రం వద్ద సిబ్బందికి ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. స్థానిక ఎస్సై రమేష్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. కూటమి నాయకులు సహా పలు సంఘాల నాయకులు శిబిరాలను ఏర్పాటు చేశారు.

మాడుగుల:స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పోలింగ్ జరిగింది. మాడుగుల మండలానికి సంబంధించి 96.35 ఓట్ల శాతం నమోదు అయ్యిందని అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అదికారిణి (ఏఈ ఆరో) కె రమాదేవి తెలిపారు. పురుషులకు సంబంధించి 39 ఓట్లు కాగా, 38ఓట్లు పోలవగా, మహిళలు ఓట్లు 16కి గాను 15 ఓట్లు పోలయ్యాయని తెలిపారు. ఎన్నికల పర్యవేక్షణ రూట్ అధికారి నాగేశ్వరరావు, సెక్టార్ అధికారి చిన్నంనాయుడు, ఎలక్షన్ డిటీ ఎం రాజా, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ రామరపు నాగేశ్వరరాలు ఎన్నికలు పర్యవేక్షించారు.

రావికమతం :మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్లో బూత్ నెంబర్ 92 లో 98.07శాతం నమోదయ్యింది. మండలంలో ఓట్లు 52 కాగా 51 ఓట్లు పోలయ్యాయి.

నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం పోలింగ్ కేంద్రంలో మొత్తం 417 ఓట్లు కాగా 397 ఓట్లు పోలయ్యాయి. అందులో 236 మంది పురుషులు, 161 మంది మహిళలు ఉన్నారు. పోలింగ్ ముగిసే సమయానికి 95.20 శాతం పోలింగ్ నమోదైంది. ఆర్డీవో వివి.రమణ, డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు.



భీమిలిలో పోలింగ్ తర్వాత తరలిస్తున్న బ్యాలెట్ బాక్స్‌లు

గొలుగొండ:గొలుగొండలో 80 ఓట్లకు గాను 78 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 95 శాతం పోలింగ్ నమోదైందని అధికారులు తెలిపారు. ఎస్సై పీ.రామారావు బందోబస్తు నిర్వహించారు.

రోలుగుంట:రోలుగుంటలో మొత్తం 48 ఓట్లు ఉండగా 48 ఓట్లు పోలయ్యాయి. అందులో 26 మంది పురుషులు, 22 మంది మహిళలు ఉన్నారు. 100 శాతం పోలింగ్ నమోదైందని పోలింగ్ ఆఫీసర్ సోమశేఖర్ తెలిపారు.అనకాపల్లి డీఎస్పీ శ్రావణి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు.



కశింకోటలో క్యూలైన్‌లో ఓటర్లు



దేవరాపల్లిలో ఓటేసిన ఉపాధ్యాయ ఓటర్లు



యలమంచిలిలో భద్రతను పర్యవేక్షిస్తున్న డిఎస్‌పి



విశాఖ నగరంలో ఓటేసిన ఉపాధ్యాయ ఓటర్లు

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న విశాఖ డెయిరీ డైరెక్టర్

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చయ్యపేట మండలం ఎల్‌బిపి అగ్రహారం గ్రామంలో బుధవారం పూరిల్లు దగ్ధమైన ఘటనలో బాధిత సానబోయిన అప్పారావు కుటుంబానికి విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ రూ.పదివేల నగదు 50 కేజీల బియ్యం సాయంగా అందజేశారు గురువారం ప్రమాద స్థలాన్ని సందర్శించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తమరాన దాసు, మాజీ ఎంపిటిసి దొండ శ్రీను, సాయం శేషు వడ్డాది పాలసంఘం అధ్యక్షుడు దొండ నరేష్, మొల్లి శ్రీను పాల్గొన్నారు

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని తురకలపూడి గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ విజయలక్ష్మి గురువారం పరిశీలించారు. కూలీలు సకాలంలో పనులకు హాజరు కావడంతోపాటు సరైన సమయంలో పని నుంచి విడుదల కావాలని మేట్లకు సూచించారు. వేసవి ఎండలు నేపథ్యంలో ఉదయం 6 గంటలకే పనులకు వచ్చేలా చర్యలు చేపట్టి, 9గంటలకు పనులను పూర్తిచేసేలా చూడాలని ఆదేశించారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి-మునగపాక: మండలంలోని అరబుపాలెం గ్రామంలో బాలవీరుల సేవా సంఘం ఆధ్వర్యంలో వినాయకుని ప్రతిష్టాపన గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరుడిని వెండితో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. విఘ్నేశ్వర బాలవీరుల సేవా సంఘం ఆధ్వర్యంలో పెంటకోట రామ్మూర్తి కుమారులు మూడు వేలమంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ఆడారి యోగేశ్వరరావు, పోలిమేర సంగమేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు బొడ్డేడ బుజ్జి, ఉపసర్పంచ్ దొడ్డి బుజ్జి, మాజీ పాల సంఘం అధ్యక్షులు కోయిల చిన్న ఎర్రయ్య నాయుడు,ఆడారి మహేష్, బొడ్డేడ గంగాధరావు,బొడ్డేడ ఆదినారాయణ, బొడ్డేడ సూరీ అప్పారావు, బొడ్డేడ మోహన్ శ్రీనివాసరావు, బొడ్డేడ రమేష్, కొయ్యలాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల ఆలయాల్లో గురువారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పంగిడి పోతురాజుబాబు లోవ వద్ద చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు విశాఖ డెయిరీ డైరీ సత్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షులు గోకవాడ కోటేశ్వరరావు, తమరాన దాసు, డొంకిన అప్పలనాయుడు, రుత్తల రాము పత్యేక పూజలు నిర్వహించారు

భక్తిశ్రద్ధలతో గుల్లేపల్లి శ్రీరాములు తీర్థం

ప్రజాశక్తి- కె.కోటపాడు: మండలంలోని గుల్లేపల్లి గ్రామంలో గురువారం శ్రీరాములు తీర్థం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అనుచరులతో కలిసి సీతారాములను దర్శించుకున్నారు. మధ్యాహ్నం గుర్రపు పరుగు పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు దేముళ్ళు ఎంపీటీసీ సభ్యులు కసిరెడ్డి దేముడుబాబు చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకు నాయుడు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు రొంగలి మహేష్ పాల్గొన్నారు.



తీర్థంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

సుగర్స్ నిర్వీర్యానికి సర్కారు కుట్ర

- విద్యుత్ సమస్యతో గోవాడలో క్రషింగ్ ఆగిపోవడం దుర్మార్గం
- ఎపి చెరుకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్రి అప్పారావు ధ్వజం

ప్రజాశక్తి- అనకాపల్లి : విద్యుత్ సమస్యతో గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్ ఆగిపోవడం దారుణమని ఆంధ్రప్రదేశ్ చెరకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ ఆగిపోవడంతో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేపట్టే దుస్థితి కల్పించడం ఫ్యాక్టరీ యాజమాన్యం, ప్రభుత్వం ఉదాసీన వైఖరిని నిదర్శనమని విరుచుకుపడ్డారు. ఏటా 5 లక్షల టన్నుల క్రషింగ్ చేసే సామర్థ్యం ఉన్న ఈ సుగర్ ఫ్యాక్టరీ తరచూ ఆగిపోవడం రైతులను వేదనకు గురిచేస్తుందన్నారు. రైతులు, ఉద్యోగుల బకాయిలు ఇవ్వడంలో గానీ, క్రషింగ్ సామర్థ్యాన్ని పెంచడంలో గానీ రాష్ట్ర ప్రభుత్వం, సుగర్స్ యాజమాన్యం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో 11 సహకార సుగర్ ఫ్యాక్టరీలు ఉంటే అనకాపల్లి జిల్లాలో గోవాడ ఫ్యాక్టరీ ఒకటే క్రషింగ్ చేస్తుందని, ఆ ఫ్యాక్టరీకి కూడా ప్రభుత్వం సహకరించకపోతే రైతుల పట్ల ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉందో స్పష్టమౌతోందన్నారు. ప్రభుత్వంపై రైతాంగం పెద్ద ఎత్తున తిరుగుబాటు చేసే పరిస్థితులు కల్పించుకోకుండా ఉండాలంటే తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని గోవాడ సుగర్స్ సామర్థ్యాన్ని పెంచాలని, లేకుంటే రైతు సంఘం తరపున పెద్ద ఎత్తున రైతులను సమీకరించి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు ఘననివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి : అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల జంక్షన్ అంబేద్కర్ విగ్రహం దగ్గర స్వాతంత్ర సమరయోధులు చంద్రశేఖర్ ఆజాద్ 94వ వర్ధంతి నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ దేశ ప్రజల్లో స్వాతంత్రోద్యమకాంక్షను రగిలించి, బ్రిటిషర్ల ఎదురొడ్డి నిలిచిన ఉద్యమ కెరటం ఆజాద్' అని కొనియాడారు.



చంద్రశేఖర్ ఆజాద్‌కు నివాళులర్పిస్తున్న ప్రవీణ్‌కుమార్, తదితరులు

కార్యక్రమంలో అంబేద్కర్ సేవా సమితి జిల్లా కోఆర్డినేటర్ బండి అప్పారావు, నటభూషణ్ శోభన్ బాబు సేవా సమితి చైర్మన్ ముగడ అప్పారావు, ఆమ్ ఆద్మీ పార్టీ అనకాపల్లి కన్వీనర్ కొణతాల హరినాథ్, దిలీప్, ఆజాద్, నర్సింగరావు, సూరి అప్పారావు, సురేష్, రాము, కృష్ణ,విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం



అన్నసమారాధనలో పాల్గొన్న జగదీష్ తదితరులు

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 31వ ఆరాధన, మహా శివరాత్రి వేడుకల్లో ఆలయం వద్దవీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందమాంబ కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం ఆలయం వద్ద నిర్వహించిన అన్నసమారాధనను కోరుకొండ జగదీష్ ప్రారంభించారు.

కార్యక్రమంలో కార్పెంటర్ సంఘం శాశ్వత గౌరవ అధ్యక్షులు కోసూరి మన్మధరావు, ఆలయ కమిటీ అధ్యక్షులు కోరుకొండ వెంకటరావు, ప్రధాన కార్యదర్శి సింహాద్రి కోటేశ్వరరావు, కోశాధికారి తుంపాల సతీష్, పట్టణ డిస్క్ క్వాలిఫైడ్ సంఘం ప్రధాన కార్యదర్శి కొమ్మోజు గోవిందరాజు, కామాక్షి కార్పెంటర్స్ సభ్యులు, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల సంఘం ఆదేశాలు బేఖాతరు!

ప్రజాశక్తి -వడ్డాది : ఎన్నికల సంఘం, ప్రభుత్వ ఉత్వర్వులు బేఖాతరు చేస్తూ, బుచ్చయ్యపేట మండలం వడ్డాది జంక్షన్‌లో ఉన్న ఎంబికేఆర్ ఒకేషనల్ కాలేజీ యాజమాన్యం గురువారం యథావిధిగా కాలేజీ తెరవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు నేపథ్యంలో 27న గురువారం ఉపాధ్యాయ ఓటర్లంతా ఓటు వేసేందుకు వీలుగా అన్ని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలకు జిల్లా కలెక్టర్ సెలవు ప్రకటించగా, వాటిని పెడచెవిన పెట్టి ఈ కాలేజీని తెరవడం, తరగతులను నిర్వహించడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. కాలేజీ తెరిచినా అధికారులు చూసీచూడనట్లు వదిలేసారా, లేక ఈ కాలేజీకి ప్రత్యేకంగా ఏమైనా పర్మిషన్ ఇచ్చారా అని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కాలేజీ యాజమాన్యంతోపాటు అధికారులు స్పందించి, వివరణ ఇవ్వాల్సి ఉంది.

వీళ్ళకి ప్రత్యేక పర్మిషన్లు ఇచ్చారా అని పలువురు సందేహాలు వెల్లువెత్తుతున్నాయి ప్రభుత్వ ప్రకటనలో బేఖాత ర్ చేసిన యాజమాన్యానికి అధికారులు ఏం చేస్తారో అని పలువురు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి

ఘనంగా కల్యాణ పోతురాజు పండగ

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని తీడ గ్రామంలో గురువారం కల్యాణ పోతురాజు పండుగ ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేకపూజలు, మొక్కుబడులు నిర్వహించగా, సాయంత్రం చెక్కతో తయారు చేసిన గుర్రాలను పలు వీధిల్లో ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిరికి సత్య నారాయణ, కూటిమి నాయకులు మేడిశెట్టి సన్యాసి నాయడు, చిరికి చైతన్య పాల్గొన్నారు.



వీధిల్లో చెక్కల గుర్రం ఊరేగిస్తున్న భక్తులు

సైన్స్ దినోత్సవం నిర్వహించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు యాజమాన్యాల పాఠశాలల్లో శుక్రవారం సైన్సు దినోత్సవాన్ని నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి అప్పారావు నాయుడు ఒక ప్రకటనల ఆదేశించారు. అందులో భాగంగా సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించాలని, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్, భౌతిక జీవశాస్త్ర ఉపాధ్యాయులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేలా, పండగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. విద్యార్థులకు ల్యాబ్ సామగ్రితో పాటు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, పోస్టర్ నిర్వహణ వంటి పోటీలు నిర్వహించాలన్నారు. వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి నివేదించాలని ఆదేశించారు. ప్రతి విభాగంలో ప్రథమ బహుమతి పొందిన విద్యార్థులను జిల్లాస్థాయి పోటీలకు పంపాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని తాళ్లపాలెం సెక్షన్ నరసింగపల్లి సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల కారణంగా ఈనెల 28న శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ విభాగం ఇఇ ఎస్.రామకృష్ణ తెలిపారు. నరసింగపల్లి, జె.తుని, చింతల పాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, బంగారయ్యపేట, ఉగ్గిని పాలెం, పరవాడపాలెం, జమ్మదలపాలెం, కొత్తపల్లి, బుచ్చయ్యపేట, పేరంటాలపాలెం, గంటవానిపాలెం, ఏఎస్ పేట, గొబ్బూరుపాలెం, నరసాపురం, సోమవరం, ఏనుగు తుని, చిన్న యెనుగుతుని, గొల్లగుంట, జి.భీమవరం, సింగవరం, అచ్చెర్ల, కోత అచ్చెర్ల, మొసయ్యపేట, గోకువానిపాలెం గ్రామాలకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సబ్బవరం.: మండలంలోని సబ్బవరం డి1, డి2 సెక్షన్ల పరిధిలోని 33/11 కెవి సబ్బవరం, అంతకాపల్లి సబ్ స్టేషన్ల పరిధిలో పిఎంఐ వర్క్స్ కారణంగా ఈనెల 28న శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కశింకోట డివిజన్ ఇఇ ఎస్.రామకృష్ణ తెలిపారు. సబ్బవరం సబ్‌స్టేషన్ పరిధిలో తవ్వవానిపాలెం , అమతపురం , గొల్లలపాలెం, పైడివాడ, ఆసకపల్లి, ఇరువాడ పంచాయతీల పరిధిలోని గ్రామాలు, అంతకాపల్లి ఫీడర్ పరిధిలోని అంతకాపల్లి, రావులమ్మపాలెం , టెక్కలిపాలెం, నాయనమ్మపాలెం, రాయపుర అగ్రహారం, అరిపాక, బంగారమ్మపాలెం, అడ్డురు, గొట్టివాడ, లగిశెట్టిపాలెం గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

శివాలయం నిర్మాణానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాత

ప్రజాశక్తి -సబ్బవరం: మండల కేంద్రంలోని శివాలయం నిర్మాణానికి సబ్బవరం గ్రామానికి చెందిన గెడ్డం కృష్ణ కుమారుడు త్రినాథ్ రూ.1,00,116 ఆర్థిక సహాయం గురువారం ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా గెడ్డం త్రినాధ్‌కు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో బర్ల రమణ, గెడ్డం కష్ణ, దంగేటి నాని, దంగేటి ప్రకాష్ ,చింతల శ్రీను, గెడ్డం రమణ, గెడ్డం రాజు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

భక్తులతో శివాలయాలు కిటకిట

ప్రజాశక్తి- కె.కోటపాడు: మహాశివరాత్రి జాగరణ చేసిన భక్తులతో గురువారం పలు శివాలయాలు కిటకిటలాడాయి. తెల్లవారుజాము భక్తులు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని సింగన్న దొరపాలెం, కే.కోటపాడు శివాలయాలతో పాటు స్థానిక షిరిడి సాయి ఆలయంలో అన్నసమారాధనలు నిర్వహించారు. సింగన్న దొరపాలెం గ్రామంలోని బండారు ముసలమ్మ ప్రతిష్టించిన వీరభద్రస్వామి దేవాలయంలో బుధవారం రాత్రి గ్రామానికి చెందిన బండారు వారి కుటుంబాలు పూజలు నిర్వహించి అన్నదానం చేశారు.

కాటేస్తున్న గ్రానైట్ క్వారీలు

- కలుషితం అవుతున్న నీటి వనరులు
- పాడవుతున్న పంట పొలాలు
- పేలుళ్ల ధాటికి బీటలు బారుతున్న గృహాలు
- ఇదీ తిరువాడ గ్రామం దుస్థితి



గ్రానైట్ క్వారీ

ప్రజాశక్తి- మాడుగుల: మండలంలోని గిరిజన పంచాయతీ శివారు పల్లెల్లో క్వారీలతో స్థానికులు సతమతం అవుతున్నారు. మాడుగుల మండల పరిధిలోని తిరువాడ గ్రామం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. చిన్న గ్రామమైనా తిరువాడు సమీపంలోని గ్రానైట్ క్వారీలతో ఎక్కువ నష్టం వాటిల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రావికమతం మండల రెవెన్యూ పరిధిలోని మూడు క్వారీలు తిరువాడకు చేరువలో ఏర్పాటయ్యాయి. క్వారీల్లో బండరాళ్లను పేల్చేందుకు క్వారీ యజమానులు బాంబులను పెడుతుండటంతో పేలుళ్ల దాటికి ఇళ్ల గోడలు బీటలు బారుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వారీల నిర్వహణకు నీటి కోసం కొండ గెడ్డల్లో పెద్ద పెద్ద గోతులు తవ్వుతుండటంతో దిగువకు నీరు రావడం లేదని వాపోతున్నారు.



పొలాల్లోని నీటిలో కలిసిన గ్రానైట్ క్వారీ సున్నం

ఇక్కడ గిరిజనులు కొండగెడ్డగా పిలిచే సీతమ్మ కాలువను అనుకోని సుమారు 50 ఎకరాల ఆయకట్టు ఉంది. పశువులు తాగునీటి కోసం ఈ కాలువ నీటినే ఆశ్రయిస్తాయి. క్వారీల యజమానులు సీతమ్మ కాలువ నీటిని ఉపయోగించుకుని వేస్ట్ వాటర్ ను కాలువకు మళ్లిస్తున్నారని స్థానికులు తెలిపారు..దీంతో నీరు సున్నం కలిసినట్లు ఉండటంతో పశువులు తాగడం లేదని, ఆ నీటిని పొలాలకు పెట్టినప్పుడు భూమి సారం తగ్గుతుందని రైతులు చెబుతున్నారు. అలాగే పారిశుధ్య సమస్యతో దోమల వ్యాప్తి అధికంగా ఉందని, కాలువలు లేకపోవడంతో మురుగు నీరంతా రోడ్ల పైకి చేరుతోందన్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆలయాలకు భారీగా తరలి వచ్చిన భక్తులు



కల్యాణపులోవకు భారీగా తరలి వచ్చిన భక్తులు

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం కళ్యాణపులోవ పోతురాజుబాబు,పెద్దింటమ్మ జాతర లో రెండవ రోజు భక్తులు జన సంద్రాన్ని తలపించారు. తొలి రోజు సుమారు ఒక లక్షా 20 వేలకు పైగా భక్తులు హాజరైనట్టు దేవాదాయ శాఖ అధికారులు అంచనా వేయగా గురువారం రెండవ రోజూ అంతకు మించి జాతరకు భక్తులు హాజరైనట్టు పేర్కొన్నారు. భక్తులకు వసుతులు కల్పించడంలో దేవాదాయ, రెవెన్యూ శాఖ అధికారులు విఫలం అయ్యారన్న విమర్శలు భక్తుల నుంచి రెండవ రోజు బహిరంగం గా వినిపించా యి. రెండవ రోజు అనకాపల్లి డీఎస్ పి శ్రావణి దైవ దర్శనం చేసుకున్నారు. గురువారం కూడా ద్విచక్ర వాహనాలు వేలాదిగా తరలి రావడంతో . కొత్తకోట సీఐ కోటేశ్వరరావు, ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ను క్రమ బద్ధికరించారు. ఆలయ ప్రాంగణం తో పాటు స్నానఘట్టాల వద్ద ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ప్రత్యేక సిబ్బంది తో పలు జాగ్రత్తలు తీసుకున్నారు. రెండవ రోజు అన్న ప్రసాదం నిర్వహించక పోవడం తో ప్రయివేట్ వ్యాపారులు ఏర్పాటు చేసిన హెూటల్స్ ను భక్తులు అశ్రయించారు.జిల్లా సహకార బ్యాంకు ఆధ్వర్యంలో రెండవ రోజు కూడా భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణి చేశారు.

కొత్తకోటలో వాసవి, వనితా క్లబ్ ఆధ్వర్యంలో రాకపోకలు సాగించే వేలాది మంది భక్తులకు పులి హెూర, మజ్జిగ ఉచితంగా సరఫరా చేయగా, కొత్తకోట హెచ్‌పి పెట్రోల్ బంక్ యజమాని పెనుగొండ నూకేశ్వరరావు భక్తులకు భారీ అన్న ప్రసాదం నిర్వహించారు.

నర్సీపట్నం టౌన్: మహాశివరాత్రి సందర్భంగా భక్తులు గురువారం తెల్లవారుజాము నుంచి పవిత్ర పుణ్యస్నానాలు ఆచరించేందుకు బలిఘట్టం ఉత్తరవాహినికి పోటెత్తారు. అనంతరం బ్రహ్మలింగేశ్వరస్వామికి దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పాకలపాడు గురుదేవుల ఆశ్రమం, ఆలయం కోలాహలంగా మారింది. పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

గొలుగొండ: మండలంలో ధారమఠం పుణ్యక్షేత్రం రెండవ రోజు కూడా భక్తుల శివనామస్మరణతో హోరెత్తింది. సుమారుగా 20వేల మంది భక్తులు జలపాతం లో స్నానాలు ఆచరించి శివాలయాన్ని దర్శించుకున్నారు. భక్తులకు అసౌకర్యాలు ఏర్పడకుండా స్థానిక సర్పంచ గెడ్డం ఆదిలక్ష్మి ఆనంద్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులంతా సేవలందించారు. జోగంపేట గ్రామానికి చెందిన పైల ప్రసాద్ ఆర్థిక సహకారంతో సుమారు 5000 మందికి భారీ అన్న సమారాధన నిర్వహించారు. నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, గొలుగొండ, నాతవరం ఎస్సైలు రామారావు, భీమరాజుల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



గొలుగొండలో పూజలు చేస్తున్న భక్తులు



నర్సీపట్నం ఉత్తర వాహిని వద్ద జన సందోహం

కృష్ణదేవిపేట నీలకంఠేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మాజీ జెడ్పిటిసి చిటికల తారక వేణుగోపాల ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు.

నక్కపల్లి: మండలంలో రాజయ్యపేట, బోయపాడు, దొండవాక సముద్రతీరంలో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని భక్తులు గురువారం పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తుల రద్దీతో తీర ప్రాంతం కిటకిటలాడింది. మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్దలు, పిల్లలు స్నానాలు ఆచరించేందుకు సముద్రతీరానికి చేరుకోవడంతో, తీరం జనసంద్రంగా దర్శిన మిచ్చింది. రాజయ్యపేట, బోయపాడు, తొండవాక సముద్ర తీరాల్లో వేలాది మంది భక్తులు స్నానాలు ఆచరించారు. సముద్ర తీరం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులతో కిక్కిరిసిపోయింది. తీరంలో ఎటుచూసినా జన సందోహమే కనిపించింది. నక్కపల్లి నుంచి రాజయ్యపేట వరకు వాహనాలు రద్దీ కనిపించింది. తీరంలో చిన్న చిన్న దుకాణాలు వెలిసాయి. సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్ని బాబు తీరం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తీర ప్రాంతంలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు.



జాతరలో పాల్గొన్న హోం మంత్రి అనిత

రాజయ్య పేటలో భక్తిశ్రద్ధలతో జాతర

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేట గ్రామంలో గురువారం నూకతాత జాతరను మత్స్యకారులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత జాతరలో పాల్గొని, గ్రామ దేవతను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.మత్స్యకారులు కులదైవం నూకతాత పండుగను మత్స్యకారులు మహాశివరాత్రి పర్వదినం పురష్కరించుకుని భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం అనవాయితీగా వస్తుంది. నూకతాత ఘటాలను సముద్రంలో స్నానాలు చేయించారు. సాంప్రదాయం, ఆచారం మేరకు పూజారులు భక్తులపై నడిచివెళ్లారు. భారీ అన్న సమారాధన నిర్వహించారు. గ్రామంలో భారీ విద్యుద్దీకరణ ఏర్పాటు చేశారు. సిఐ కుమారస్వామి, ఎస్ఐ సన్ని బాబులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ పద్మావతి

అల్పాహారం పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం మున్సిపాలిటీ బలిఘట్టం ఉత్తర వాహిని వద్ద మహాశివరాత్రి సందర్భంగా పుణ్యస్నానానికి వచ్చిన భక్తులకు అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం వద్ద అన్నపూర్ణ అక్షయపాత్ర ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు సతీమణి, కౌన్సిలర్ చింతకాయల పద్మావతి, కోడలు దివ్యశ్రీ రాజేష్ హాజరై భక్తులకు స్వయంగా అల్పాహారం పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

ఏప్రిల్ 24న ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి -రావికమతం: మరుపాక ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష తేదీని మార్పు చేయడం జరిగిందని ప్రిన్సిపాల్ కె.సత్య సునీల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థిని, విద్యార్థులు 6వ తరగతి ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి మార్చి 20 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశపరీక్ష ఏప్రిల్ 24న గురువారం నిర్వహించ నున్నామని తెలిపారు.ప్రవేశ పరీక్ష 5వ తరగతి సిలబస్ ఆధారంగానే ఉంటుందని, విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకుని, ఆ వివరాలను పాఠశాలకు అందజేయాలని ఆయన తెలిపారు. మెరిట్, స్థానికత ఆధారంగా ఎంపిక ప్రక్రియ జరుగుతుందని ఆయన తెలిపారు.

2న ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి- రావిక మతం: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి దేవాలయం ముస్తాబయ్యింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు తెలిపిన సమాచారం మేరకు మార్చి రెండవ తేదీన దేవాలయ ప్రారంభోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఏకలవ్య పాఠశాలలో విచారణ

ప్రజాశక్తి-చింతపల్లి : ఇటీవల చింతపల్లి ఏకలవ్య పాఠశాలపై వస్తున్న ఆరోపణలపై గురువారం రెండో దఫా విచారణ జరిపినట్లు గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రజని తెలిపారు. కో ఎడ్యుకేషన్ కాబట్టి బాలురను, బాలికలను వేర్వేరుగా విచారించడం జరిగిందన్నారు. వీరితో పాటు ఉపాధ్యాయులకు సూచనలు చేసినట్లు ఆమె వివరించారు. రైట్ ఎడ్యుకేషన్ యాక్ట్ ప్రకారం నేరుగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోకూడదన్నారు. తల్లిదండ్రుల ద్వారా విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని తెలియజేయడం జరిగిందన్నారు. మరింత లోతుగా దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని, ఇప్పటి నివేదిక కలెక్టర్‌కు ఇవ్వనున్నట్లు వివరించారు.



కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ

సంపద కేంద్రాలతో ఆదాయం

ప్రజాశక్తి- నక్కపల్లి:చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవాలని ఎంపీడీవో డి.సీతారామరాజు అన్నారు. మండలంలోని జి.జగన్నాథపురంలో గురువారం సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. వర్మీ కంపోస్టును పరిశీలించారు. చెత్త నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామంలో తడి,పొడి చెత్తను వేరువేరుగా సేకరించి సంపద కేంద్రానికి తరలించాలని సూచించారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలని, తడి పొడి చెత్తను వేరువేరుగా బకెట్లో వేసే విధంగా చూడాలన్నారు. ప్రతిరోజు ప్రతి ఇంటి నుండి చెత్తను సేకరించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఇఓపిఆర్డి ఎం.శ్రీను, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల బండ్ల పోటీలు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని జె.నాయుడుపాలెం, కొండపాలెం గ్రామాల్లో గురువారం పోతురాజుబాబు పండుగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోలుగుంట గ్రామంలో పోతురాజుబాబు ఉత్సవ కమిటీ వారు అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కొండపాలెం గ్రామంలో జిల్లా స్థాయి ఎడ్లబండి పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన మొదటి, రెండవ, మూడవ బహుమతులను నిర్వాహకులు అందజేశారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: స్కూల్ ఆఫ్ బిల్డింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సిఈపిటి యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ టెక్నాలజీ (ఎఫ్టీ) 2025 సంవత్సరానికి యూజి, పిజీ ప్రోగ్రాములకు దరఖాస్తులు కోరుతున్నట్లు యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ అనల్ షా తెలిపారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సివిల్ ఇంజనీరింగ్, బిల్డింగ్ ఎనర్జీ పెర్ఫార్మెన్స్, జియోమాటిక్స్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ డిజైన్, కన్స్ట్రక్షన్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్మెంట్ వంటి నిరంతరం అభివృద్ధి చెందుతున్న రంగాల అవసరాలపై దృష్టి సారించి అందుకు సంబంధించిన వివిధ కోర్సులను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ విధానం, స్టూడియో-ఆధారిత ప్రాజెక్టుల ద్వారా ఆచరణాత్మక అభ్యాసానికి బలమైన ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు,వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణ మౌలిక సదుపాయాలు, నిర్మించిన పర్యావరణ రంగాలలో పరిశ్రమలు ఎక్కువగా కోరుకునే నైపుణ్యాలు, జ్ఞానంతో గ్రాడ్యుయేట్లను సన్నద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

చెత్త కుప్పలో శిశువు కలకలం



ప్రజాశక్తి- నక్కపల్లి: మండలంలోని చినదొడ్డుగల్లు ఎస్సీ కాలనీ సమీపంలో చెత్తకుప్పలో ఐదు నెలల శిశువు పిండాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గురువారం సాయంత్రం ఆడ పిండాన్ని చెత్త కుప్పలో వదిలేసి గుర్తు తెలియని వారు వెళ్లారు. ఈ మేరకు సీఐ కుమారస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



పర్యటిస్తున్న విఎంఆర్‌డిఎ కమిషనర్

విఎంఆర్‌డిఎ కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ:విఎంఆర్డిఏ మెట్రో పాలిటన్ కమీషనర్ విశ్వనాధన్ ఎంవిపి సెంట్రల్ నర్సరీ అభివృద్ధి పనులను పరిశీలించారు. రహదారి, ఆఫీస్ భవనం, పంప్ హౌస్ నిర్మాణాలను పరిశీలించి మార్పులు, చేర్పులను సూచించారు. నిర్మాణ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారుడు, అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్ బలరామరాజు, కార్యనిర్వహక ఇంజనీర్ మధుసూధన్‌రావు, ఇన్చార్జి డిఎఫ్ఓ సుజాతా శివానీ, ఉపకార్యనిర్వాహక ఇంజనీర్ విశ్వనాథ్, సహాయక ఇంజనీర్ శ్రీనివాస రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రైతుతో మాట్లాడుతున్న నరసింహులు

14న పాడి పశువుల పాల పోటీలు

ప్రజాశక్తి- చీడికాడ:పశు సంవర్ధక శాఖ, బొవైన్ మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఆద్వర్యంలో విజయనగరం జిల్లా తోటపాలెంలో నిర్వహించే ఉత్తరాంధ్ర పాడి పశువుల పాల పోటీలలో దిగుబడినిచ్చే పశువులను తీసుకొచ్చి పాల్గొనాల్సిందిగా పాడేరు డివిజన్ ఉప సంచాలకులు సి.హెచ్ నరసింహులు తెలిపారు. చీడికాడ మండలంలోని వింటిపాలెం, జి. కొత్తపల్లి, అడవి అగ్రహారం గ్రామాలలో పర్యటించారు. పోటీలో పాల్గొనదలచిన పాడి రైతులు మార్చి 14న మధ్యాహ్నం 3 గంటల లోపు పోటీలకు హాజరవ్వాలన్నారు. పోటీలో పాల్గొనే రైతులకు ఉచిత వసతి, బోజన సదుపాయం, పశువును తీసుకెళ్లేందుకు రవాణా ఛార్జీలు ఇవ్వబడుతుందనాన్రు. జెర్సీ, హెచ్. ఎఫ్, ముర్రా, ఒంగోలు, దేశీయ జాతులు, గిర్, సాహివాల్ మొదలైన ఆరు విభాగాల్లో మొదటి బహుమతి రూ.50000,. రెండవ బహుమతి రూ.40000, మూడవ బహుమతి రూ.30000 ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు చిట్టి నాయుడు, పశు వైద్యులు గాయత్రి దేవి, గణేష్, పశు సంవర్ధక సహాయకులు రాజేష్, గంగునాయుడు, మాధవి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లకు జరిమానా

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో బుధవారం గొట్టువాడ సమీపంలో అనుమతులు లేకుండా రవాణా చేస్తూ పట్టుబడ్డ ఇసుక ట్రాక్టర్లకు రూ.5000 చొప్పున జరిమానా విధించినట్లు తహసిల్దారు తిరుమలబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్రమ ఇసుక రవాణాను అనుమతించేది లేదని, మొదటిసారి పట్టుబడిన వాహనాలకు 5000, రెండవసారి పట్టుబడితే రూ.10,000 చొప్పున జరిమానా విధించి మూడోసారి కూడా పట్టుబడితే వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు.



తనిఖీలు చేపడుతున్న డిఆర్ఎం

డిఆర్ఎం ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ:వాల్తేరు డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా బుధవారం అర్ధరాత్రి విజయనగరం స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్లాట్ ఫాం నెం.1, బుకింగ్ ఆఫీస్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, క్యాటరింగ్ స్టాల్స్ పరిశీలించారు . స్టేషన్‌లోని అమృత్ భారత్ స్టేషన్ పనులను సమీక్షించారు. తొలిసారిగా స్టేషన్‌కు వచ్చిన సందర్భంగా స్టేషన్ లోని వివిధ సౌకర్యాలను పరిశీలించారు. పరిశుభ్రత, క్రౌడ్ మేనేజ్మెంట్, ప్రయాణీకుల సౌకర్యాలు, భద్రతకు సంబంధించిన సమస్యలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో ఆయన వెంట ఏడీఆర్ఎం (ఆపరేషన్స్) మనోజ్ కుమార్ సాహూ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి -గంగవరం : జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ వంద రోజులు పని దినాలు కల్పించకపోతే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఎన్ఆర్ఇ జిఎస్ ఎపి ప్రకాష్ సిబ్బందికి సూచిం చారు. గురువారం కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో వారాంతపు సమీక్ష నిర్వహించారు. 60 రోజులు పూర్తి చేసుకున్న అన్ని జాబ్ కార్డు దారులకు 100 రోజులు పని పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించి, పనులకు వచ్చేలా చూడాలన్నారు. ఫిజికల్ కంప్లీట్‌లో వున్న 100 ఫారం పండ్స్ కాకుండా మిగిలిన 68 ఫారం ఫండ్స్ పనులను వచ్చేనెల 10నాటికి పూర్తిచేయాలన్నారు. సోక్ పిట్‌లన్నీ మొదలు పెట్టి, పూర్తి చేయాలన్నారు.